సాక్షి
వికారాబాద్
శనివారం । 7 । జూన్ । 2025



వసతులు వివరిస్తూ..

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు.

10లో▸



ఉపాధి కూలీల వెతలు

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు.

10లో▸



పేదల సంక్షేమమే..

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు.

11లో▸

న్యూస్‌రీల్

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ మహేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్

పరిగి: మహిళా సంఘాల్లోని సభ్యులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ మహేశ్వర్ అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో పూడూరు, పరిగి సంఘాల సభ్యులకు ఏలీప్ ఆధ్వర్యంలో రాంప్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ(సెర్ప్) అలీప్ సంయుక్తంగా మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం కృషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అలీప్ సభ్యురాలు కవిత, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాజీద్వారా కేసుల పరిష్కారం ఉత్తమం



మాట్లాడుతున్న జడ్జి స్వరూప

ఆమనగల్లు: కక్షిదారులు రాజీద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ఆమనగల్లు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప సూచించారు. ఈనెల 14న నిర్వహించే లోక్ అదాలత్ నేపథ్యంలో పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం పోలీసు కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. చిన్నచిన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉన్నందున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డి, కడ్తాల సీఐ గంగాధర్, మాడ్గుల సీఐ వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహాన్, ఎస్‌ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


'బెస్ట్ అవైలబుల్'లో 43 సీట్లు

కడ్తాల్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలను ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య తెలిపారు. ఆయా తరగతుల్లో మొత్తం 43 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 9నుంచి 13వ తేదీ వరకు జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందజేస్తామని, 17న సాయంత్రం 5గంటలలోపు నేరుగా ఆఫీసులో లేదా పోస్టు ద్వారా అందించాలని సూచించారు. 21న లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత

హుడాకాంప్లెక్స్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అదనపు సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రితో పాటు కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్కేటింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి వేంకటేశ్వర రావుతో కలిసి పతకాలు అందజేశారు.

రశీదు ఉంటే రక్షణ



ఫోన్‌లో రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి

పంట దెబ్బతింటే నష్టపరిహారం పొందే అవకాశం

- ఎరువులు, విత్తనాలు కొంటే విధిగా బిల్లులు తీసుకోవాలి
- సీజన్‌కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాం
- పంట మార్పిడితో అధిక దిగుబడులు
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి

సాక్షి ఫోన్ ఇన్

వికారాబాద్, పరిగి, మోమిన్‌పేట్: ఎరువులు, విత్తనాలు కొనే రైతులు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి అన్నారు. ఒకవేళ పంట దెబ్బతింటే నష్ట పరిహారం పొందేందుకు రశీదులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం తదితర సందేహాలను రైతులు ఫోన్ చేసి నివృత్తి చేసుకున్నారు. అన్నదాతలు అడిగిన ప్రశ్నలకు డీఏఓ సమాధానం ఇవ్వడంతోపాటు సాగుపై సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట మార్పిడి పద్ధతి పాటిస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు.. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడకూడదని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు.

➡ మా మండలంలో విత్తనాల కొరత ఉంది. ప్రస్తుత సీజన్‌లో ఏయే పంటలు సాగు చేయాలి?

– గోపాల్‌రెడ్డి, రైతు, దౌల్తాబాద్

డీఏఓ మోహన్‌రెడ్డి: ఖరీఫ్‌లో వరి సాగు మేలు. బతుకమ్మ, తెలంగాణ సోనా, కేఎస్ఆర్ వంటి రకాలు సాగు చేయాలి. కంది సాగుకూడా మంచిదే. కంది విత్తనాల కోసం మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

➡ నకిలీ విత్తనాల సమస్య ఎక్కువగా ఉంది. రబీ సీజన్‌లో పరిగి పట్టణంలో వరి విత్తనాలు కొనుగోలు చేశా.. దిగుబడి రాలేదు.

– అశోక్, రైతు, కుల్కచర్ల

◆ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విత్తనాల కొనుగోలు బిల్లుతో మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి మండలంలో 125 ఎకరాల్లో రైతులచే సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలి.

➡ మండలంలో జనుము విత్తనాలు దొరకడం లేదు. ఇటీవల డ్రిప్ పరికరాలు ఇచ్చారు. కానీ అమర్చడానికి సిబ్బంది రాలేదు.

– ముకుందరెడ్డి, రైతు, పెద్దేముల్

◆ జనుము విత్తనాలు అందుబాటులో లేవు. జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. కావాల్సిన రైతులు తాండూరు ఏఓ కార్యాలయంలో పొందవచ్చు. డ్రిప్ పరికరాలు అమర్చేలా చర్యలు తీసుకుంటాం.

➡ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు.

– అంజిప్ప, రైతు, రేగడిమైలారం, బొంరాస్‌పేట

◆ ఎరువుల దుకాణాల్లో ధరల పట్టిక ఉండాలి. ఎక్కువ ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం. ఇలాంటి సమస్యలపై రైతు వేదికల్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

➡ విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

– అశోక్, శివరాంకాలనీ వికారాబాద్

◆ సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి.

➡ పత్తిలో ఏ రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి?

– యాదయ్య, రైతు, బొంపల్లి, దోమ మండలం

◆ అన్ని రకాల పత్తి విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తున్నాయి. కంపెనీ విత్తనాలనే కొనుగోలు చేయాలి. బీజీ 2 రకం అన్ని తెలుగుళ్లను తట్టుకుంటుంది. వరి అయితే 1010 రకం, ఆర్ఎన్ఆర్, జగిత్యాల రకాలు ఎంపిక చేసుకోవాలి.

➡ జనుము విత్తనాలు దొరకడం లేదు.

– షకీల్, రైతు, పెద్దేముల్

◆ పెద్దేముల్ మండలంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

➡ కంది సాగులో ఏయే పద్ధతులు పాటించాలి?

– లాలయ్య, లింగంపల్లి, బొంరాస్‌పేట

◆ ఆశ రకం కంది విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. పీఆర్‌జీ 176 కూడా మంచి దిగుబడిని ఇస్తోంది. త్వరలో ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తాం. అవసరం ఉన్నవారు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

➡ ఏటా మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేస్తున్నా.. దిగుబడి రావడం లేదు.

– కుషాల్, కొండాయిపల్లి, దోమ మండలం

◆ కంది పంట ఎక్కువగా పెరగకుండా కొనలు కోసి వేయాలి. తాండూరు రకం, పీఆర్‌జీ 176 కంది విత్తనాలు సాగు చేసుకోవాలి. వేరుశనగలో లేపాక్షి రకం ఎంచుకోవాలి.

➡ దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారు.

– వెంకటయ్య, రైతు, దేవనోనిగూడ, పూడూరు మండలం

◆ డీఏపీని రూ.1,350, యూరియా రూ.266 మాత్రమే విక్రయించాలి. ఎక్కువ ధరలకు విక్రయిస్తే దుకాణ లైసెన్స్ రద్దు చేస్తాం.

➡ ముందస్తు వర్షాల నేపథ్యంలో ఏయే పంటలు సాగు చేస్తే మంచిది.

– రవీందర్, రైతు, పూడూరు

◆ కంది, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసుకోవాలి. నీరు ఉంటే వరి సాగు మేలు. ప్రస్తుత వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందజేస్తుంది.

➡ ప్రస్తుత సీజన్‌లో ఏయే పంటలు సాగు చేస్తే మంచిది?

– దయాకర్, దోమ

◆ పంట మార్పిడి పద్ధతి పాటించాలి. మెట్ట పొలాల్లో కంది, మొక్కజొన్న, పత్తి, రాగి పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది.

➡ రేవంత్ కంపెనీ పత్తి విత్తనాలను బ్లాక్‌లో విక్రయిస్తున్నారు.

– శ్రీనివాస్, రైతు, కేరవేల్లి, పూడూరు

◆ అన్ని కంపెనీలకు చెందిన కంది విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తాయి. ఏ రకమైనా అధిక ధరలకు కొనుగోలు చేయరాదు. ఎక్కువ ధరకు అమ్మితే ఫిర్యాదు చేయండి.

➡ రెండున్నర ఎకరాలకు ఎంత మేర పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి?

– ప్రేమ్‌సింగ్, గంజిపల్లి, దోమ

◆ యాభై శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. 2.5 ఎకరాలకు 40కిలో బస్తా విత్తుకుంటే సరిపోతుంది. విత్తిన 40 రోజుల్లో కలియ దున్నాలి.

➡ విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

– శాంతికుమార్, చిట్టిగిద్ద, నవాబుపేట

◆ ప్రస్తుతం సబ్సిడీ విత్తనాలు లేవు. మినీ కిట్స్ అందుబాటులో ఉన్నాయి. వారం రోజుల్లో సబ్సిడీ విత్తనాలు వస్తాయి. మండల వ్యవసాయ అధికారులను కలిస్తే పంపిణీ చేస్తారు.

9నుంచి డీఈఈ సెట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్



ప్రిన్సిపాల్ రామాచారి

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డీఈఈ సెట్ – 2025లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించనునట్లు వికారాబాద్ గవర్నమెంట్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కే రామాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్ల కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, 4 నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయం, కుల తదితర ధ్రువపత్రాలతో వికారాబాద్ డైట్ కళాశాలకు రావాలని సూచించారు.

10న గిరిజన గురుకులంలో ప్రవేశానికి..

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులో గల గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో విద్యార్థులు చేరేందుకు ఈ నెల 10న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11గంటలకు కళాశాలలో విద్యార్థుల టీసీ, పదో తరగతి మార్కుల మెమో, స్టడీ, కాండెక్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల ఆదాయం రూ. 2లక్షలకు మించరాదని తెలిపారు. ఆధార్ కార్డు, స్పోర్ట్స్, అర్ఫన్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 8333925370లో సంప్రదించాలని తెలిపారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యార్థుల సంఖ్య పెంచండి

- బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం
- వందశాతం అక్షరాస్యతకు కృషి చేద్దాం
- బడిబాటలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని.. ఇందుకు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని సూచించారు. శుక్రవారం మండలంలోని బురాన్‌పూర్, బొంరాస్‌పేటలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సేవలు, బోధన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపి వందశాతం అక్షరాస్యతను సాధించాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. బురాన్‌పూర్ గురుకుల పాఠశాల, ఎంపీయూపీఎస్‌లో అదనపు తరగతి గదులు, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిర్మాణ దశలో ఉన్న రోడ్లను పరిశీలించారు. బుర్రితండా – మెట్లకుంట మీదుగా బొంరాస్‌పేట వరకు చేపట్టిన బీటీ డబుల్ రోడ్డు పనులను పరిశీలించారు. టేకులగడ్డ తండా – గురుదోట్ల బీటీ రోడ్డు పనులను, సాలిండాపూర్ మాలకుంటతండా – ముద్దాయిపేట బీటీ రోడ్డు పనులను, మండల కేంద్రం బీటీ రోడ్డును, కల్వర్టు నిర్మాణ పనులను, జాతీయ రహదారి 163 నుంచి కొత్తూరు వరకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. బురాన్‌పూర్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, నాయకులు నర్సింలు గౌడ్, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి

కొడంగల్: నియోజకవర్గంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పట్టణంలోని శ్రీ పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలన్నారు. అనంతరం బూల్కాపూర్ బీటీ రోడ్డు పనులను, చిట్లపల్లి తండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణ, డీఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్ మండలంలో..

దుద్యాల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. హకీంపేట్‌లో సమీకృత పాఠశాల భవనాన్ని, పులిచర్లకుంట తండాకు వేస్తున్న సీసీ రోడ్డు పనులను, గౌరారం–లగచర్ల రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ, డీఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్యకు చెక్

- రూ.16 కోట్లతో చిలుకవాగు అభివృద్ధి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి ఇకపై వరదనీటి తరలింపు సమస్య దూరం కానునట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డితో కలిసి పాతకుంట నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు నిర్మించనున్న డ్రైన్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసినప్పుడు పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వరదనీరు శాంతి నగర్, పాతకుంట, సాయిపూర్ తదతర ప్రాంతాల్లోని జనావాసాల మధ్య నిలిచి ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.2 కోట్లతో పాతకుంట నుంచి సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వరకు 200 మీటర్ల మేరకు అవుట్‌ఫాల్ డ్రైన్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ నెల 11న పనులను ప్రారంభించనున్నట్లు వివరించారు. రూ.16 కోట్లతో చిలకవాగు కాలువ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ రెండు నిర్మాణ పనులు పూర్తయితే పట్టణంలోని వార్డులు వరదనీటి సమస్య నుంచి బయట పడతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల నర్సింలు, హబీబ్ లాలా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

మట్టి గణపయ్యలను ప్రతిష్ఠించి పర్యావరణానికి మేలు చేద్దామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు హిందూ సంఘటన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న మట్టి గణపతి.. మహా గణపతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. రసాయనాలతో కూడిన విగ్రహాలను ప్రతిష్ఠించి, వాటిని నీటిలో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణం కలుషితమవుతోందన్నారు. ఈసారి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తామన్నారు. పదివేల విగ్రహాలను తయారు చేయించి పంపిణీ చేస్తామన్నారు. తాండూరులో ఉద్యమ రూపంలో మట్టి గణపతులను ప్రతిష్ఠించేలా కృషి చేస్తామన్నారు. ఇందుకు హిందూ సంఘటన్ ప్రతినిధుల చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, హిందూ సంఘటన్ ప్రతినిధులు బస్వరాజ్, రామకృష్ణ, రజనీకాంత్, రాజ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణ, నరేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం పలు మండలాలకు చెందిన 140 మంది లబ్ధిదారులకు రూ.51లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనులకు భూమిపూజ

తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వర ఆలయ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా కట్టే షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు చోటు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సింహులు, నగేష్, రవికుమార్, వీరశైవ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన వంట పాత్రలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

యాలాల: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గిరిజాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి భూ సమస్యలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు అని ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలన్నారు. సమస్యల వారీగా దరఖాస్తులను విడదీసి, రికార్డుల్లో పొందుపరచాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ వరకు చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీఓ యాదయ్య, ఆర్ఐ వేణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

బడిబాటను విజయవంతం చేద్దాం

డీఈఓ రేణుకాదేవి

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని డీఈఓ రేణుకాదేవి ప్రారంభించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయ బృందాలు, వార్డెన్లు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు బడిబాటను పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

యూనిఫామ్ అందించాలి

దుద్యాల్: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని హస్నాబాద్‌లో ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు సరిపోయే విధంగా డ్రెస్ కుట్టాలని సూచించారు. కార్యక్రమంలో కొడంగల్ ఎంఈవో రామ్‌రెడ్డి, ఎంపీడీవో ఉషా శ్రీ,, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు.



కొడంగల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ రేణుకాదేవి

క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉందాం


అల్లాపూర్‌లో అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు

కుల్కచర్ల: చెడు అలవాట్లకు దూరంగా ఉండి, టీబీ(క్షయ)ని నివారిద్దామని పల్లె దవాఖానా వైద్యురాలు అరుణ, టీబీ కోఆర్డినేటర్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, పటేల్‌చెరువు తండా, దాస్యనాయక్ తండాల్లో టీబీ, హెచ్ఐవీ, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యపానం, ధూమపానం తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మెరుగైన ఆరోగ్య నియమాలు పాటిస్తే వ్యాధులను దూరం చేయవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యాదమ్మ, రత్నమ్మ, ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మటన్ షాపు ఏర్పాటును నిలిపేయండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఐక్య వేదిక సభ్యులు

తాండూరు టౌన్: పట్టణంలోని వినాయక్ చౌక్‌లో ఏర్పాటు చేయనున్న మటన్ షాపును నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. అత్యంత రద్దీగా ఉండే, పాఠశాలలు, దేవాలయాలు ఉన్న ప్రాంతంలో మటన్ షాపు ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. 41 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామన్నారు. అత్యంత పవిత్రంగా భావించే చోట మటన్ షాపు ఏర్పాటు చేయనీయొద్దని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక సభ్యులు రజినీకాంత్, రామకృష్ణ, భాను, మహేశ్ ఉన్నారు.

స్వీట్ బ్రెడ్‌పై సిగరెట్ ముక్క!


బ్రెడ్‌పై సిగరెట్ ముక్క

ధారూరు: మండల కేంద్రంలోని బెంగళూర్ బేకరీలో స్వీట్ బ్రెడ్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లిన ఓ వ్యక్తి.. కవర్ విప్పి చూడగా బ్రెడ్‌పై కనిపించిన సిగరెట్ ముక్కను చూసి అవాక్కయ్యాడు. వెంటనే వెళ్లి బేకరీలో ప్రశ్నించగా నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నారని, ప్రజలు, వినియోగదారులు మండిపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనాస్థలిలో మృతదేహం

చేవెళ్ల: లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వర్ష హర్షవర్ధన్(19) చదువుకుంటూ ఉపాధి కోసం చిన్నచిన్న పనులు చేసుకుంటున్నాడు. గురువారం అతడు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి అర్ధరాత్రి వికారాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో దామరగిద్ద సమీపంలోకి రాగానే వికారాబాద్ నుంచి చేవెళ్ల వస్తున్న ఓ లారీ అతివేగంగా వచ్చి అతడి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అతని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్వే ల్యాండ్ రికార్డులను పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు

లక్డీకాపూల్: 2024 బ్యాచ్‌కి చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. టౌన్ సర్వే ల్యాండ్ రికార్డులను పరిశీలించారు. హైదరాబాద్‌లో సర్వే రికార్డ్స్ భద్రపరిచే విధానం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి వి.శ్రీరామ్, సహాయ సంచాలకులు, మధుసూదన్, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతులు వివరిస్తూ చేరేలా ప్రేరేపిస్తూ

ప్రత్యేకతలను తెలియజేస్తూ గ్రామాల్లో ముమ్మర ప్రచారం

- అందుబాటులో తెలుగు/ఇంగ్లిష్ మీడియాలు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్య


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కొడంగల్ రూరల్: విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన అధ్యాపకులు గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ నిష్ణాతులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యబోధన, సువిశాలమైన క్రీడా ప్రాంగణంతో పాటు అన్ని సౌకర్యాలతో కూడిన తెలుగు, ఇంగ్లిష్ మీడియాలు అందుబాటులో ఉన్నాయని తెలుపుతున్నారు. గతేడాది విద్యార్థులు సాధించిన ఫలితాలు వివరిస్తూ కాలేజీలో చేరాలని, పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి విస్తృత రీతిలో ప్రచారం కల్పిస్తున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ సబ్జెక్టులకు సంబంధించి ఇంగ్లిష్/తెలుగు మీడియాలు అందుబాటులో ఉన్నాయని, హెచ్ఈసీకి ఉర్దూ మీడియం సైతం అందని వారు పేర్కొంటున్నారు.

రెండు పూటలా క్లాసులు

ప్రతి రోజూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు, చదువుతోపాటు ప్రతి శుక్రవారం ఒక గంట సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతి శనివారం ఒక గంట క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొంటున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, అర్హత కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, బస్ పాస్ సౌకర్యం వంటి వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని వివరిస్తున్నారు. గతేడాది మొదటి సంవత్సరం 52 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలోనే ప్రథమ స్థానం, సెకండ్ ఇయర్‌లో 65శాతం ఉత్తీర్ణతతో కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచిందని, క్రమశిక్షణతో మంచి విద్యను అందుకునేందుకు విద్యార్థులు కళాశాలలో చేరాలని అధ్యాపక సిబ్బంది కోరుతున్నారు.

ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సర్కారు కళాశాలల్లో చదివి కన్వీనర్ కోటాలో ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, బీ–ఆర్క్(ఆర్కిటెక్చర్) కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులకు పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలనే నిబంధనలున్నాయని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు.

నిష్ణాతులతో విద్యాబోధన



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యాబోధన నిర్వహిస్తున్నాం. పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు, గతేడాది టీజీఈఏపీసెట్‌లో 16 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక క్లాసులు చెబుతున్నాం. దీంతో మెరుగైన ఫలితాలు పొందుతున్నాం.
– నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్, జీజేసీ కొడంగల్


ధారూరులో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

ఆశల పంట ఆరంభం

- విత్తనాలు నాటే పనుల్లో రైతులు నిమగ్నం
- వ్యవసాయ భూముల్లో సందడి వాతావరణం

ధారూరు: వానాకాలం పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మంచి రోజు ఉందంటూ విత్తనాలు, ఎరువులు పట్టుకుని పొలాలకు బయల్దేరారు. ఈసారి మే నెలలో కురిసిన అకాల వర్షాలకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న కర్షకులు.. రోహిణి కార్తె ప్రారంభంలోనే సాలేటి వానలు కురవడంతో పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, సోయా, పసుపు తదితర పంటలు నాటే పనుల్లో బిజీగా ఉన్నారు. హరిదాస్‌పల్లి, రాంపూర్‌తండా, డీకేతండా, లక్ష్మీనగర్‌తండా, పీసీఎంతండా, అల్లిపూర్, ఎబ్బనూర్, చింతకుంట, ధారూరు, దోర్నాల్, గురుదోట్ల తదితర గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో ఎక్కడ చూసినా సాగు పనులు ముమ్మరంగా సాగడం కనిపించింది.

ఎరువుల కొరత..

పంట సాగుకు అవసరమైన డీఏపీ, యూరియా ఎరువుల కొరత వేధిస్తోందని రైతులు చెబుతున్నారు. డిమాండ్ మేర విత్తనాలు, ఎరువులు దొరకడం లేదని పేర్కొంటున్నారు. ఇదే అదునుగా కొంతమంది వ్యాపారులు ధరలు అధికం చేసి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నందిగామ: సమాజంలోని ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని శ్రీనివాసులుగూడలో శుక్రవారం హనుమాన్ దేవాలయం ఆవరణలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని, దీంతో మానసిక ఒత్తిడిలు దూరం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, నాయకులు మురళీ యాదవ్, శ్రీశైలం, చంద్రారెడ్డి, నర్సింహాగౌడ్, నారాయణరెడ్డి, రవీందర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలగా కస్తూర్బా

జిల్లేడ్ చౌదరిగూడ కేజీబీవీని అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం


కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తూంపల్లిలో కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రత్యేకాధికారి రాగ సుధా ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఒక్కో గ్రూప్‌లో కేవలం 40 మందిని మాత్రమే అడ్మిషన్ చేసుకుంటామన్నారు. ఈ గ్రూప్‌లలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 12వ తేదీ లోపు తమ సర్టిఫికెట్లు తీసుకొని నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

కళాశాల విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు అతిథి(గెస్టు) అధ్యాపకులుగా పనిచేయుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రత్యేకాధికారి రాగ సుధా తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జీవశాస్త్రం, రసాయనశాస్త్రం బోధించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 91005 51506ను సంప్రదించాలన్నారు.

ఆవు కళేబరంతో ఆందోళన

నందిగామ: పరిశ్రమ వదులుతున్న కాలుష్యం కారణంగా తన పాడి ఆవు చనిపోయిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. పెద్దకుంటతండాకు చెందిన శ్రీను వ్యవసాయంతో పాటు ఆవులను పోషిస్తూ పాలు ఉత్పత్తి చేస్తున్నాడు. ఎంఎస్ఎన్ పరిశ్రమ వెనకాలే ఇతని పాక ఉంది. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వాయు, నీటి కాలుష్యంతో తన ఆవులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నాయని తెలిపాడు. ఈక్రమంలో శుక్రవారం రూ.లక్ష విలువ చేసే ఆవు మృతిచెందిందని వాపోయాడు. ట్రాక్టర్ ట్రాలీలో ఆవు కళేబరాన్ని వేసుకుని ఫ్యాక్టరీ గేటు ఎదుట ఆందోళన చేపట్టాడు. రెండు రోజుల్లో పరిహారం చెల్లిస్తామని యాజమాన్యం, హెచ్ఆర్ ప్రతినిధి హామీ ఇవ్వడంతో శాంతించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీ అరెస్టు

సనత్‌నగర్: క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఓ బుకీతో సహా మరో ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా గన్‌బజార్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ వరలక్ష్మి, ఇతర సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఓ ఇంట్లో బెల్లం కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదే ఇంట్లో సుధాకర్ రెడ్డి, మయూర్ జోషి అనే ఇద్దరు పందెం కాసేవారు కూడా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలం నుంచి ఓ ల్యాప్‌ట్యాప్, రూ.1,44,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌ట్యాప్‌లో ఇన్‌స్టాల్ చేసిన మ్యాట్రిక్స్ బెట్టింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్


తాండూరు రూరల్: అల్లాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

తాండూరు రూరల్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలో అల్లాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీదారుడిని పదేపదే తిప్పుకోకూడదని, అర్జీలు అందించేందుకు వచ్చేవారితో సున్నితంగా వ్యవహరించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. అదేవిధంగా ఐనెల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొడంగల్: భూ భారతి చట్టంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే అవకాశం ఏర్పడిందని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. త్వరలో భూ వివాదాలు పరిష్కారం అవుతాయన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిమేశ్వరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూ భారతి చట్టం గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


కుల్కచర్ల: ఆర్డీఓను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

కుల్కచర్ల: ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్డీఓ వాసుచంద్ర చెప్పారు. శుక్రవారం మండలంలోని అనంతసాగర్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ... రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వారి గ్రామాలకు వచ్చారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షు డు మహేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో అధికారుల ను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటి త హసీల్దార్ చంద్రశేఖర్, గిర్దావర్లు(ఆర్ఐ) రవి, ఖాజా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కర్నల్ సి.ఎస్.రావు తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఎన్‌సీసీలో చేరుతున్న విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని 7వ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ సి.ఎస్.రావు, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ రైజింగ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నల్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులందరూ క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని దేశభక్తి గౌరవాన్ని నిలిపేందుకు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మేజర్ రేవతిప్రభాకరన్, కెప్టెన్ డాక్టర్ పి.కవిత పాల్గొన్నారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం

శంషాబాద్: పోరాటాలతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య అన్నారు. జిల్లా అధ్యక్షు డు రామస్వామి అధ్యక్షతన శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర సర్కారు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. దీంతో శ్రమజీవులు పూర్తిగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నాయన దుయ్యబట్టారు. ప్రధాన కార్యదర్శి పి.పర్వతాలు, సామిడి శేఖర్‌రెడ్డి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

జీడిమెట్ల: మహిళను హత్య చేసి సూటుకేసులో కుక్కి పారవేసిన కేసులో నిందితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్, ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేపాల్‌కు చెందిన తారా బెహరా(33), విజయ్‌తోఫాలు పరిచయస్తులు. తారాబెహరాకు వివాహం కాగా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విడిపోయి విడిగా ఉంటుండగా ఆమెకు విజయ్ తోఫాతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. కొద్దిరోజులకు విజయ్ హైదరాబాద్ రావాలని ఇద్దరం కలిసి ఉందామని తారాను అడిగాడు. విజయ్ చెప్పినట్లుగానే తారా 2 నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి జూబ్లీహిల్స్‌లోని విజయ్ తల్లిదండ్రుల వద్ద ఉంది. ఆ తర్వాత కొద్దిరోజులకు బౌరంపేటలోని 60 గజాల్లోకి వచ్చి అక్కడే ఓ గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు ఉంటున్నారు. ఈక్రమంలో తారా గర్భవతి అయ్యింది. తారా గర్భం వద్దని, అబార్షన్ చేయించాలని కోరగా..విజయ్ అందుకు ఒప్పుకోలేదు. మే 23న ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన విజయ్ తోఫా నైలాన్ తాడును తారా మెడకు బిగించి ఉపిరాడకుండా చేసి ప్రాణం తీశాడు.

మృతదేహాన్ని సూట్‌కేసులో ఉంచి..

మతదేహాన్ని ఇంట్లో ఉంచిన విజయ్ కూకట్‌పల్లికి వెళ్లి అదేరోజు పెద్ద సూటుకేసు కొనుక్కొచ్చాడు. అందులో మృతదేహాన్ని పెట్టి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సమీపంలో పారవేశాడు. జూన్ 4న నిర్మానుష్య ప్రదేశంలో సూటుకేసు నుండి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన వెలుగుచూసిన విషయం విదితమే. కాగా నిందితుడు విజయ్ జూబ్లీహిల్స్‌లో ఉన్నట్లు గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు విజయ్ బెహరాపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు రుణాలు

అలీప్ సంస్థ కమిటీ సభ్యురాలు మల్లిక

చేవెళ్ల: స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన నైపుణ్య శిక్షణలు పొంది అభివృద్ధి చెందాలని అలీప్(అసోషియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) సంస్థ కమిటీ సభ్యురాలు మల్లిక, సెర్ప్ ఏపీఎం శోభారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య సభ్యులకు ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అలీప్ సంస్థ సభ్యులు పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు వస్తే వారికి వృత్తి నైపుణ్యాలలో 15 రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అలీప్ సంస్థ సభ్యులు, సీసీలు షబ్బీర్, ప్రభాకర్, సాగర్, నర్సింలు, శ్రీనివాస్, మానెయ్య, యాదయ్య, తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల వెతలు

ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు

- సకాలంలో అందజేయాలని విజ్ఞప్తి


నందారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దౌల్తాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. గ్రామీణులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఈ పథకం నిధుల లేమితో కొనసాగుతుంది. దాదాపు ఎనిమిది వారాలుగా డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి కూలీపైనే ఆధారపడిన శ్రమజీవుల పరిస్థితి మాత్రం దయనీయంగా మారింది.

ఏప్రిల్ నుంచి ఎదురుచూపులు

మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. అన్నిచోట్ల ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. మండలంలో ఆయా గ్రామాల్లో పని చేసిన కూలీలకు నెలల తరబడి కూలీ డబ్బులు అందక అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు కూలీ డబ్బుల కోసం కూలీలు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదిగో వస్తాయని చెబుతున్నారే తప్పా ఇంతవరకు డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 కోట్లు బకాయి

దౌల్తాబాద్ మండలంలో మొత్తం 7474 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయి. వాటిలో 14811 మంది కూలీలున్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 2500 మంది కూలీలు వివిధ పనుల్లో పాల్గొన్నారు. ఎనిమిది వారాల నుంచి అందాల్సిన కూలీ డబ్బులు రాలేదు. సుమారు రూ.3 కోట్ల వరకు పెండింగ్ బకాయిలు పేరుకు పోయాయి. డబ్బులు సకాలంలో రాకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కేవలం వీటిపై ఆధారపడి జీవనం సాగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి సకాలంలో నగదు చెల్లించాలని కోరుతున్నారు.

కూలీ డబ్బులే ఆధారం



ఉపాధి పథకంలో కూలీ పనులు చేశాం. ఎనిమిది వారాలుగా డబ్బులు అందడంలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తమకు కూలీ డబ్బులే ఆధారం. నెలల తరబడి కూలీ డబ్బులు రాకుంటే ఏమి తినాలి. వెంటనే వేతనాలు అందజేయాలి.
– వెంకటమ్మ, కూలీ, దౌల్తాబాద్

ఆందోళన చెందొద్దు



ఏప్రిల్ నెల మొదటి వారం వరకు కూలీలకు డబ్బులు వచ్చాయి. రెండో వారం నుంచి ఎనిమిది వారాల డబ్బులు రావాల్సి ఉంది. ఇది జాతీయ రాష్ట్ర స్థాయికి సంబంధించిన అంశం. డబ్బులు వస్తాయి, కూలీలు ఆందోళన చెందొద్దు.
– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్